కృష్ణాపత్రిక: 15-6-63.

# దొంగ

రామ్మూర్తిని పోలీసులు అరెస్టు చేశారు. రామ్మూర్తి అంటే శేఖరం తమ్ముడన్న మాట!

♦ ♦ ♦

రామ్మూర్తి దిగాల్సిన స్టేషనుకు రైలు చేరేసరికి సంధ్యవేళ అయింది. చేతిసంచి అందుకుని వొళ్ళు భారంగా విరుచుకుని రైలు దిగాడు. స్టేషన్ చిన్నది గాబట్టి అట్టే మంది దిగలేదు.

స్టేషనుకు తోడుగా కొండలు గంభీరంగా నిలబడి వున్నాయి. ప్లాట్‌ఫారం మీది దీపాలు, బిక్కు బిక్కుమంటూ చూస్తున్నాయి.

పోవాల్సింది చాలా దూరం. అందుకని కాళ్ళు చకచకా ముందుకు సాగినయ్. గేటు దగ్గర టికెట్ ఇచ్చేసి బాట మీదకు కాలు బెట్టాడు.

పిల్లవాడు గీసిన సరళ రేఖలా వుంది రోడ్డు. రామ్మూర్తికి ముందుగా కొంతమంది జనం నడుస్తున్నారు మాట్లాడుకుంటూ!

స్టేషను వూరికి రెండు మైళ్ళు ఎడంగా వుంది. రైలు క్రమశిక్షణతో ప్రయాణం చేస్తే, ముందుగానే రావాల్సింది. కానీ అది ఆలస్యంగా నడవటంలోనే క్రమశిక్షణ పాటించగలదు.

తను వ్రాసిన ఉత్తరం చేరే వుంటుంది శేఖరానికి అని అనుకున్నాడు రామ్మూర్తి. చేరినట్లు సమాధానము మాత్రం రాలేదు. తీరికలేని పనుల వల్ల వ్రాయలేదని మరోసారైతే సరిపెట్టుకునేవాడే! గొంతుకు ఉరి వచ్చింది తనకు. పరువు ప్రతిష్ఠ నడివీధిలో కాపురానికి తయారయ్యే ఆపత్సమయంలో గూడ అశ్రద్ధ చేయడం భావ్యమా? అన్నదే సంశయం రామ్మూర్తికి -

"శేఖరం జవాబు వ్రాశాడా నాయనా?" అని అడిగింది రామ్మూర్తిని తల్లి, ఇంట్లోకి రావటం గమనించి!

"ఉత్తరం వ్రాసి గూడా పది రోజులు కావస్తోంది, ఎడ్రసదీ సరీగ్గా వ్రాశావు గదూ!"

"సరీగ్గానే వ్రాశాను!" రామ్మూర్తి నిరామయంగా సమాధానం చెప్పాడు. అందులో ఆసక్తి లేదు. ప్రస్తుతం అదని దృష్టంతా ఎదురుగా క్లిష్ట సమస్య మీదనే వుంది. ఇంకా సరీగ్గా మూడు రోజులుకు తను డబ్బు చెల్లించకపోతే ఇల్లు, పొలం జప్తు చేస్తారు. నడివీధిలో వేల మేస్తారు!

రామ్మూర్తికి పరువు మీద, నీతి మీద నమ్మకం జాస్తి!

"వూళ్ళో వున్నాడో లేదో! వుంటే తప్పకుండా జవాబు వచ్చేదే!"

తల్లి మాటలు రామ్మూర్తి విన్నాడు, వూరుకున్నాడు. రామ్మూర్తి నమ్మకమూ అంతే! అయితేనేం మాలతి - అంటే రామ్మూర్తి భార్య.... మాత్రం వూరుకోలా?

"మీ పిచ్చగానీ అత్తగారూ! ఎంత తీరిక లేకపోయినా, వూళ్ళో లేకపోయినా నాలుగు అక్షరాల ఉత్తరం వ్రాయటం ఏం బ్రహ్మవిద్యనీ! వర్ధనక్కగారైనా వ్రాయొచ్చుగా!"

ఏది ఏమైనా రామ్మూర్తికి ముందున్న గండం గడిచే ఆశ శేఖరం మీద వుంచుకున్నాడు. అది యిలాగైంది.

భోజనం చేసే వేళ, మాలతి అడిగింది: "వరదరాజులు గారిని అడిగిచూడలేక పోయినారా?"

"అదీ అయింది. లేవంటే లేవన్నాడు. అంతటితో వూరుకోక చిన్న సలహా గూడ ఇచ్చాడు!"

"ఏమిటో?"

"ఏముంది, కాకితో కబురంపితే మీ అన్నగారు పంపడా! కొండంత అన్నను వుంచుకుని ఇదేం పనన్నాడు!"

మాలతి, "అయిన వాళ్ళను అడిగే కంటే అడుక్కుతినటం మేలని తెలియదు కాబోలు!" అని అన్నది.

మాలతికి శేఖరం వాళ్ళంటే మొదటి నుంచీ గిట్టేది కాదు. వాళ్ళ ఐశ్వర్యాన్ని చూసి, చూపే ఈర్ష్య తాలూకు చిహ్నాలని అతని నమ్మకం!

"అయినా ఓసారి వెళ్ళిరారా! తప్పకుండా పనౌతుంది! నీ కాపద వస్తే వాడికొచ్చినట్లు గాదా ఏమిటి? నా మాట విను, ఒక్కసారి వెళ్ళిరా!"

తల్లి సలహా మాలతికి నచ్చలా!

"వెళ్ళిరాండి! ఆమె మాట కాదనడమెందుకు? వెళ్ళొస్తే ఆ సంబరమూ తీరుతుంది. ఆ మాటేదో వాళ్ళకే వుంటుంది. 'చూశావా అంత ముఖ్యమైతే ఓసారి రాకూడదా!' అన్న మాటకు ఆస్కారం లేకుండా వుంటుంది!"

రామ్మూర్తికి అంతకన్న గత్యంతరము కనబడలా!

"ఏ వూరు బాబూ?"

రామ్మూర్తి ఆలోచన నుంచి విడివడి ప్రక్కనున్న మనిషిని చూసి, "పడమర, సత్తెనపల్లి పైన!" అని సమాధానం చెప్పాడు.

వూళ్ళోని దీపాలు కనపడుతున్నాయి.

"ఎవరింటికి?"

"శేఖరంగారింటికి!.... వున్నారా"

"లేడల్లే వుంది బాబూ, మద్దినాల కారు యాడికో పోయింది!"

రామ్మూర్తి ఆశలు కుప్పలా కూలాయి!కాళ్ళల్లో సత్తువ దిగజారింది.

"మీకు ఏం గావల బాబూ?" శేఖరంగారు!

"అన్నయ్య!"

"అంటే మీ సొంత అన్నయ్యేనా?"

"అహఁ!"

"అట్టనా! - చీకటి పడింది చిన్నగా రాండి! ఆ చేసంచి యిట్లా తేండి నే పట్టుకొస్తా!" ఆ మనిషిఎక్కడలేని గౌరవం చూపాడు! అవును! శేఖరం అంటే పక్కా పదూళ్ళకు మోతు బరి, ఆస్థిలో అయివేజులో అంతటివాడు లేడు.

"ఇట్లా యివ్వండి బాబూ!"

"అక్కర్లేదులే!"

"మీ అన్నగారికి సంతానం లేదన్న ఒక్క కొరతా తప్పితే, యింకే విషయంలో లోపం లేదు... మీకూ పిల్లలా బాబూ?"

"ఆ! యిద్దరాడపిల్లలు, ఒక కొడుకు!"

యింతలో శేఖరం మేడ దగ్గరకు రానే వచ్చారు. తోడు వచ్చిన మనిషి, ముందుకు రెండడుగులు వేసి, కాంపౌండు గేటు నెట్టి, "రాండి బాబూ" అని పిలిచాడు.

గేటు చప్పుడై బంగళాలో కుక్క, 'ఎవరది?' అన్నట్లు కేకేసింది.

రామ్మూర్తి క్రితంసారి వచ్చినప్పుడా కుక్క లేదు. కుక్క అరుపు విని పనివాడు బయట కొచ్చి, "ఎవరా వచ్చేది?" అని కేకేసి, లైటు వెలిగించాడు.

ముందుగా వస్తున్న పరంధామయ్యని గుర్తుపట్టి, "ఎవరు మావా, నీ వెనకాల?" అని ప్రశ్నించాడు.

పరంధామయ్య నెత్తి మీది మూట దింపుకుని, "బాబుగారు తమ్ముడుగారు రాజాలు! చీకటి గదూ అందుకని వెంటేసుకు వచ్చా!" అని చెమట పట్టిన మొహాన్ని తుడుచుకుని, మూట తీసుకుని, "వస్తా బాబూ!" అని వెళ్ళాడు.

రామ్మూర్తి చేతిసంచీ పట్టుకుని నిలబడే వున్నాడింతసేపూ! నౌకరు రాజాలు వెనకాల కుక్క కొత్త మనిషిని తినేలా చూస్తూ మూలుగుతున్నది.

"ఛహేయ్! కూర్చోండి! అమ్మగారితో చెప్పొస్తా!" అని రాజాలు లోపల కెళ్ళిం తరువాత, బిడియపడుతూ కుర్చీలో కూర్చున్నాడు. బ్లూలైట్ వెలుతురు మెట్ల మీద నుంచి క్రింద పచ్చగడ్డి మీదకు పాకుతోంది. కుక్క రామ్మూర్తిని చూసి, రామ్మూర్తి కుక్కను చూసీ అనీజీగా ఫీలవసాగారు.

ప్రశాంతంగా వున్న ఆ బంగళా వరండాలో ఒకరి ఉనికిని వేరొకరు సహించనట్లు రామ్మూర్తి, కుక్క బాధపడసాగారు. తెల్లని గోడలకు అలంకరించిన చిత్రపటాలను పర ధ్యానంగా చూస్తూ, కుక్క చర్యలను ఒక కంటితో కనిపెడుతూ, లోపలకు పోయిన నౌకరు రాక కోసం ఎదురు చూస్తున్నాడు.

స్వయాన అన్నగారైన శేఖరం యింట్లో తను స్వాతంత్రం లేనట్లు రావాల్సిరావటం రామ్మూర్తికి బాధగానే వుంది. అంతమాత్రాన లేని స్వాతంత్ర్యాన్ని సంపాయించు కుందా మన్న ప్రయత్నమూ అతనిలో లేదు.

సుమారు మూడు సంవత్సరాల క్రితం వచ్చినప్పుడు, తనను ఏ విధంగా ఆ యింటిలోని వ్యక్తులు గౌరవించిందీ, తత్ఫలితంగా, ఆత్మాభిమానం ఏ విధంగా పతనమయి, తను బాధపడ్డదీ రామ్మూర్తి కింకా మనసులోనే వుంది. కానీ అన్నీ మర్చిపోయి ఏమీ జరగనట్లు ప్రవర్తించాలి. అంతకు వినా గత్యంతరం లేదు.

రాజాలు వచ్చేసరికి, రామ్మూర్తికి విసుగు వచ్చింది. స్వయానా ఏకగర్భ జనితులైన

శేఖరం యింట్లో తనకు ఈ బంధిఖానా ఏమిటి? ఈ అంతరాలేమిటి? పరాయివాళ్ళకు మల్లే అనుజ్ఞయేమిటి? కుర్చీలోంచి లేవబోయ్యేసరికి, వాకిలి దగ్గర పడుకున్న కుక్క లేచింది. రామ్మూర్తికి కుక్కలంటే భయం లేదు గానీ దుష్ట జంతువుకి దూరంగా వుండాలని మాత్రం తెలుసు!

రాజాలు వచ్చి, "రాండి! అమ్మగారు రమ్మంటున్నారు!" అని పిల్చేసరికి ప్రాణం లేచి వచ్చింది. సంచీ తీసుకుని ఆమె వున్న గదిలోకి వెళ్ళాడు. పూజ చేసుకుంటూ దేవుడి గదిలో వుంది వర్ధనమ్మగారు.... అంటే రామ్మూర్తి వదిన.... శేఖరం భార్య.

పట్టుచీర కట్టుకుని, తల్లో గన్నేరు పువ్వు పెట్టుకుని, ఆ భక్తి ప్రవాహానికి అంతరాయం కలిగినందుకు, కించిత్తు విసుగు కనబరుస్తూ, "నువ్వా! నాయనా! ఎవరో అనుకున్నాను! కూర్చో!" అని, "యిదేనా రావటం?.... అయ్యో ఆ పీట వాల్చుకో! నే లేవలేనిప్పుడు!" అని అంది.

రామ్మూర్తి, "ఫరవాలేదులే వదినా!" అని క్రిందనే కూర్చున్నాడు. అగరువత్తుల వాసన గుబాళించింది. గాలి ఆడక ఉక్కపోస్తోంది.

"అత్తగారూ, చెల్లెలు మాలతి కులాసా గదూ! మీ అన్నయ్యను రోజూ ఉత్తరం వ్రాసి క్షేమ సమాచారాలు కనుక్కోమంటా! ఆయనకు తీరదు! నువ్వున్నావన్న ధీమా! అత్తగారికి నీ దగ్గరుంటే స్వర్గంలో వున్నట్లే!.... ఆ! ఏమిటి సంగతులు?"

ఆమె వాక్ ప్రవాహానికి రామ్మూర్తి ఉక్కిరి బిక్కిరి కాసాగాడు! ఆమె ధోరణి ఎప్పుడూ అంతే!

"ముందులేచి స్నానం కానియ్యి! తర్వాత మాట్లాడుకుందాం! నాకూ పూజ వుంది.... అరేయ్ రాజాలూ...."

ఆ గదిలోంచి బయటపడేసరికి, ప్రాణం లేచి వచ్చింది. అంత మేడలో ఇంత చిన్న సంచి ఎక్కడ దాచాలో తోచలా రామ్మూర్తికి! తమ యింట్లోలా అటకలూ, పీటలూ, వంకెలూ కనపడలా! అన్నీ సోఫాలూ, అద్దాలూ, చిత్రపటాలూ, విలువైన సామాన్లూ వున్నాయి. తన సంచి ఎక్కడ దాచేట్లు తోచలా!

"ఇవిగోనండి తుండ్లు! త్వరగా తయారవండి!" రాజాలు హెచ్చరిక చేశాడు. రామ్మూర్తి అవస్త అతనికేం తెలుసు?

"ఈ సంచి దాస్తావు?"

"ఏవున్నాయండీ అందులో, డబ్బు అవ్వీ ఉంటే యివ్వండి అమ్మగారికిస్తా! దాచి పెడుతుంది" - రాజాలు చెయ్యి చాచాడు.

రామ్మూర్తి చెయ్యి దించుకున్నాడు - "అవేం లేవు! వొఠ్ఠి గుడ్డలే వున్నాయి!"

"అయితే అలా పారెయ్యండి. ఖాళీది యాడ పడేస్తే ఏమండి, రాండి!"

రామ్మూర్తి చూస్తూ చూస్తూ అంత పని చెయ్యలేకపోయాడు. కానీ రాజాలు చేశాడు.

రామ్మూర్తి స్నానం చేసి, భోజనం చేశాడు. వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు.

ధనం అంతరాల్ని సృష్టిస్తుంది! ఆత్మీయత, అనురాగం అన్నిటినీ రూపుమాపుతుంది. వర్ధనమ్మగారు చాలా తెలివిగలది, ఆమె తెలివి, మాటల్లో, చేతల్లో, అన్నిటా ప్రదర్శింప గలదు. భూషిస్తున్నదీ, దూషిస్తున్నదీ గూడా తెలియదు, ఆమె మాటల్లో! కాని మనసుకు నొప్పి కలుగదు. కానీ వాటికి వాడితనం, వేడితనం వుంటాయి! రామ్మూర్తికి ఆమె అంటే భయముంది! అసహ్యముంది. గౌరవమూ, చేతగానితనమూ వున్నాయి అతనికి ఆమె అంటే!

"పక్కేశానయ్యగారూ!"

రామ్మూర్తి యాంత్రికంగా లేచి వెళ్ళాడు! వరండాలో వేసిన మంచం మీద కూర్చున్నాడు.

"రాజాలూ! అయ్యగారు ఎక్కడి కెళ్ళాడు?"

"అయ్యగారాండీ! వేట కెళ్ళారు!"

"ఎప్పుడొస్తారు?"

"తెలియదు!"

"ఎవరెవరెళ్ళారు?"

"బాబుగారు, రాజాగారు, సూపర్నెంట్‌గారూ, నారపరెడ్డిగారూ!"

రాజాగారంటే వర్ధనమ్మ పింతల్లి కొడుకు.

"చూడు రాజాలు! కుక్కని కట్టేస్తారు గదూ!"

"లేదు బాబూ! కాపలా తిరుగుతుంది!"

"చూడు! అదంటే నా కసలే - కట్టెయ్యరాదూ ఈ ఒక్క రాత్రికి! వదినెతో చెప్పు!"

రామ్మూర్తిని చూస్తే జాలేసింది రాజాలుకి 'అలాగే' అని వెళ్ళాడు.

:: 2 ::

రామ్మూర్తికి అప్పటికి ఏడేళ్ళు. ఆ రోజులు బాగా జ్ఞాపకం!

శేఖరం పదేళ్ళవాడు! ఫస్టుఫారం చదువుతున్నాడు. మొదట్నుంచీ శేఖరం ఆరోగ్యంగా, చలాకీగా వుండేవాడు. అందుకని తల్లికి శేఖరం మీద ప్రేమ జాస్తి. ఉన్నంతలో వాడినే ఎక్కువ ఆప్యాయంగా చూసేది. మంచి గుడ్డలూ అతనికే కుట్టిచ్చేది. శేఖరానికి పూర్తి భిన్నం రామ్మూర్తి. పుట్టిన తదాపి రోగాలో, అనారోగ్యంలో చిక్కి కదురుగా ఈసురోమంటూ వుండేవాడు! అదీ యిద్దరికీ తారతమ్యం!

సీతారామయ్యగారు.... అంటే రామ్మూర్తి వాళ్ళ తండ్రి అన్నమాట.... పూర్తిగా కర్మిష్టి! కానున్నది కాక మానదు అని చేతులు ముడుచు క్కూర్చునే తత్త్వం గల మనిషి! అందుచేత వున్న కాస్త పొలంలో వచ్చే ఆదాయమూ.... గోచీకి ఎక్కువ.... అంగవస్త్రానికి తక్కువ

అన్నట్లు వుండేది. ఆడపనీ మొగపనీ అంతా లక్ష్మమ్మగారే చూసుకునేది. సీతారామయ్య గారెప్పుడూ ఆ పెద్ద పొట్ట మీద రామ్మూర్తిని పెట్టుకుని వీధిలో భిచాణా వేసేవారు. భోజనం వేళ వరకూ కదలరు ఆయన! అలాంటి కాపురం రామ్మూర్తిది మొదటి నుంచీ!

ఆ రోజు రామ్మూర్తికి బాగా జ్ఞాపకం! తల్లి అన్నం పెడుతూ భర్తను హెచ్చరించింది!

"అవధాని గారెందుకు పదే పదే తిరుగుతున్నారు మీ చుట్టూ?"

రామ్మూర్తి తండ్రి ప్రక్కనే కూర్చొనున్నాడు తండ్రి నల్లని దేహాన్ని లాంతరు వెలుతుర్లో చూస్తూ!

"మాట్లాడరేం? వినపడటంలా?"

"పనుండే వస్తున్నాడు!"

సీతారామయ్యగారికి, అన్నిట్లో అశ్రద్ధ జాస్తి! అది లక్ష్మమ్మగారికి చిరాకు కోపం తెప్పిస్తుంటుంది!

"ఆ పనేమిటా అని?"

"ఏముంది! శేఖరాన్ని పెంచుకుంటానికి కావాలిట!"

"అది తెలుసు - ఏమన్నారు మీరు?" తల్లి కంఠంలో కోపం, బాధ, ఆవేదన, అసహ్యం కనిపించినయ్!

"ఇస్తామన్నాను!"

"ఆ! ఎవర్నడిగి అన్నారామాట.... మాట్లాడరేం.... అంత ఎక్కువైనాడా వాడు.... నే చచ్చాననుకున్నారా!..... మాట్లాడరేం...."

ఆమె గొంతుకలోంచి శోకం పొంగులు వారింది, కంఠం రుద్ధమైంది.... జీరబోయింది. ఆమె మాతృ హృదయం బల్లెములతో గ్రుచ్చినట్లయింది. కని, పెంచి కన్నులలో పెట్టి పెంచుకున్న కొడుకు పరాధీనమవుతుంటే ఏ తల్లి సహించగలదు?

ఆమెకు చదువూ, సంస్కారం, లేకపోవచ్చు! కానీ కన్న మమకారముంది! రాజాధి రాజులా పెంచలేకపోవచ్చు! కానీ కన్నకొడుకుపై విడదీయరాని అనురాగబంధముంది!

"నా బొందిలో ప్రాణముండగా ఈ పని జరగటానికి వీల్లేదు!" ఆమె శపథం పట్టింది.

సీతారామయ్యగారు మాట్లాడలా!

"నూతిలో దూకి ఛస్తాను? అంతే, వాడిని దత్తుకు మాత్రం యివ్వను! ముష్టెత్తి పెంచుకుంటా! అంతేగానీ, తల్లీతండ్రీ వుండగా, అన్ని మమకారాలూ, బంధనాలూ త్రెంచుకుని పరాయి వాళ్ళకు ధారాదత్తం చెయ్యలేను.... చెయ్యను...." ఆమె శోకమూర్తి అయింది.

"ఉన్నాడుగా వొకడు! చాలదూ!"

"ఏమిటీ! వాడుంటే వీడెక్కువా! పెంచలేమా! పోషించలేమా! చెట్టుకు కాయ బరువా!

కథా నిలయం
5763
శ్రీకాకుళం

మన పిల్లలు మనకు బరువా?"

"అని ఎవరన్నారు?"

"కాపోతే ఏమిటి? ఎందుకు పంపుతున్నట్లు?"

"బాగుపడతాడని! కావాల్సినంత డబ్బు!"

"డబ్బు లేకపోతే బ్రతకలేమా! డబ్బుకు అమ్ముకుంటామా! అందుకేనా కన్నది! చెప్పండి!.... చెప్పరేం?"

సీతారామయ్యగారిదీ మానవ హృదయమే అవటం వల్ల కాస్తంత చలించింది!

కానీ అవధాని మాటలు జ్ఞాపకమొచ్చాయి.

"చూడండి! అదృష్టం అందరికీ రాదు. లోకంలో ఎందరికి లేరు పిల్లలు. అందర్నీ వదలి మీ పిల్లవాడే కావాలనటం ఎందుకో ఆలోచించుకో! మాచారంలో ఎటు చూచినా వాళ్ళ భూములే! యింటి నిండా మూలిగే ధనం. అష్టైశ్వర్యాలతో తులతూగుతాడు. పిలిస్తే పలికే పనిమనుష్యులు! ప్రేమ మీకేనా? అందరికీ వుండదూ! మనం చూడాల్సింది వాళ్ళ భవిష్యత్తు! వాళ్ళు బాగుపడి పైకొస్తే అంతకన్న కావల్సిందేముంది? అప్పుడుమటుకు మీ కొడుకు అనరూ! కూటికి, గుడ్డకూ అల్లాడి అక్షరం ముక్కలు రాక, మనందరిలాగే బ్రతికితే సార్థకమేముంది? ఆలోచించుకో. వాడు పెద్దవాడైతే మీకు ఆసరాగా కూడ వుంటాడు! ఏమంటావ్?"

సీతారామయ్యగారికి అవధాని మాటలు బాగా నచ్చినయ్! పైగా తీరికగా మంచీ - చెడు ఆలోచించేటంత ఓపిక, శ్రద్ధ అయనకు లేవు! ఏదిఏమైనా లక్ష్మమ్మగారి హఠం అయన్నేమీ మార్చలేక పోయింది. మూడు రోజులు ఆమె పట్టు విడువకుండా సత్యాగ్రహం కొనసాగించింది. నాలుగోనాటి ఉదయానికల్లా మేళ తాళాలతో జమీందారుగారు కారుతో సహా రానే వచ్చాడు!

ఏమనుకుందో ఏమో, శేఖరానికి తలంటి పోసి, నుదుట తిలకం దిద్ది, కళ్ళకు కాటుక బెట్టి క్రొత్త లాగూ చొక్కా తొడిగి, లక్ష్మమ్మగారు తయారు చేసింది కొడుకును.

ఆమె నేత్రాలలో, స్తబ్ధమైన ఆమె ముఖంలో ఏదో తెగువ, బాధ, వాత్సల్యం తొణికిసలాడాయి! ఏదో కొద్దిపాటి మాటలు మినహా మరేం నోరు మెదపలా ఆమె! అవీ కొద్ది మాటలే!

"శేఖరం. వెల్తున్నావా బాబూ! పుట్టిన వంశానికీ, మెట్టబోయే వంశ గౌరవాలకు లోపంరాని విధంగా ప్రవర్తించు!" అని మాత్రం అనగలిగింది. ఆ కొద్ది మాటలకే ఆమె గొంతు జీరబోయింది. తడబిడ పడ్డది.

సీతారామయ్యగారు మాత్రం ఏమీ జరగనట్లే ప్రవర్తించసాగాడు! శేఖరాన్ని తీసుకువెళ్ళి జమీందారుగారు, శుభలగ్నాన దత్త స్వీకార మహోత్సవం జరుపుకున్నారు. అంతా యథా

విధిగా జరిగింతరువాత, జమిందారుగారు సీతారామయ్యగారికి, లక్ష్మమ్మగారికి నూతన వస్త్రాలు కట్టబెట్టి, పాదాలకు నమస్కరించి, “వదినగారూ! మా వంశం నిలిపినందుకు మీకు ఎంతైనా ఋణపడి వున్నాను. మీ ఋణం తీర్చుకోలేను. కాని నాదొక చిన్న మనవి.... ఏమీ లేదు - ఈ వెయ్యి రూపాయలూ తీసుకుని నన్ను సంతోష పెట్టండి!” అని వేడుకున్నాడు.

సీతారామయ్యగారు చెయ్యి చాపేంతలో, లక్ష్మమ్మగారు చెంగున లేచి, “చూడండి, మేము మా పిల్లవాణ్ణి అమ్ముకోలేదు. అలాంటి భావం మీకుంటే ముందే చెప్పాల్సింది. కూటికి గతిలేని వాళ్ళమైనా, పిల్లవాణ్ణి అమ్ముకోము! ఆ డబ్బు తీసుకెళ్ళండి!..... ఇక ఆ ప్రస్తావన దయుంచి తేకండి!” అని అన్నది. జమీందారు నిజంగా విస్తుపొయ్యారు ఆమె సౌశీల్యానికి,సుగుణ సంపదకూ!

ఆ తర్వాత కొన్నాళ్ళవరకూ, శేఖరం అక్కడా యిక్కడా వున్నాడు. కానీ తర్వాత పూర్తిగా కన్న తల్లిదండ్రుల్ని, తమ్ముణ్ని, పుట్టి కొన్నాళ్ళు పెరిగిన పరిసరాల్ని శేఖరం మర్చిపోసాగాడు.

కాలం ముందుకు సాగుతూనే వుంటుంది. కాలంతో సాగలేక కొందరు కాలగతి చెందుతుంటారు. సీతారామయ్యగారు కాలం చేశారు. శేఖరం పెళ్ళి జరిగింది, వైభవోపేతంగా! లక్ష్మమ్మగారూ, రామ్మూర్తి పరిచయస్తులుగా మాత్రమే ఆ వివాహంలో చూడబడ్డారు. కానీ శేఖరం పెంపుడు తండ్రి మాత్రం వీరిని తగు విధంగా సత్కరించాలని వృధా శ్రమ పడ్డాడు. కానీ ఆయన వయసుకు దాసుడై లేచి తిరగలేని స్థితిలో గదిలో వున్నాడు. ఆయన ముడుతపడిన ముహంలో లక్ష్మమ్మగారంటే అమిత గౌరవం కనుపించేది.

శేఖరం వివాహానికి పూర్తిగా విభిన్న పద్ధతిలో రామ్మూర్తి వివాహం జరిగింది. శేఖరం మాత్రం వచ్చాడు. వర్ధనమ్మగారు మాత్రం అనారోగ్య కారణాలవల్ల రాలేకపోయిందని శేఖరం అన్నాడు కానీ రామ్మూర్తి నమ్మలా. ఎందుకు రాలేదో రామ్మూర్తికి తెలుసు!

ఏక గర్భ సంజాతులైన శేఖరం - రామ్మూర్తిలో ఎక్కడా పోలికలు లేవు. వృత్తిలో, ప్రవృత్తిలో, ప్రవర్తనలో, అన్నిటా భేదమే! శేఖరం బ్రతుకనేర్చినవాడు! ఏ ఎండ కా గొడుగూ, ఏ గాలికా వాటంగా ప్రవర్తించుకోగలడు. కానీ రామ్మూర్తి కది పూర్తిగా అలవాటు లేకపోగా, నేర్చుకుందామన్న ఆసక్తీ లేదు.

శేఖరం తండ్రి చనిపోతూ ఒక చిన్న ఘనకార్యం చేసి పోయినాడు. లక్ష్మమ్మగారి కుటుంబం కావాలంటే.... అన్నా అనకపోయినా, రెండు వేల రూపాయలు యివ్వాల్సిందిగా శేఖరాన్ని ఆదేశించాడు.

:: 3::

రామ్మూర్తికి కుక్క అరుపుతో మెలకువ వచ్చింది. తూర్పున తెల్లవారుతోంది. అప్పుడే జీపులు రెండు వచ్చి ఆగినయ్! నాలుగైదు కుక్కలతో శేఖరం, రాజా, రెడ్డిగారూ వచ్చారు.

అందరూ వేట నిమిత్తం వెళ్ళటం వల్ల దానికి అనుగుణ్యమైన దుస్తులు ధరించి వున్నారు. నిద్రలేక కళ్ళు ఎర్రబడి, మొహాలన్నీ పీక్కుపోయి వున్నవి. బిలబిలమంటూ అంతా లోపల కొచ్చారు! రాజాలు, వర్ధనమ్మగారూ, మిగతా పనివాళ్ళూ వచ్చి వాళ్ళను చుట్టు ముట్టారు.

"చిక్కిందా! బాబుగారూ!"

"లేదురా! డామ్‌షేమ్! అంతమంది వుండంగా, చడీ చప్పుడుగాకుండా, మేకను ఈడ్చుకుపోయింది!" - శేఖరం తుపాకీ సోఫా మీద పడేసి, "చూడు రాజాలు! కాఫీ తయారు చెయ్యి అందరికీ!" అని పురమాయించాడు.

రెడ్డిగారు నడికారు మనిషి! వేటలో అనుభవశాలి! అజానుబాహువు మనిషి! ఆయన ముహంలో విచారమూ, అవమానమూ కనపడసాగాయి!

"ఇదే మొదటిది?"

"ఎందుకో?" రాజా అడిగాడు.

వర్ధనమ్మగారు భర్త ప్రక్కన కూర్చుంది.

"నా చేతి దెబ్బతిన్నది ప్రాణాలతో బ్రతికిపోలా ఇంతవరకూ! ఇదే మొదటిది!" - పౌరుషం కళ్ళలో కాపురముందాయనకు!

"మీ తప్పేంలేదు, రాజా తొందరపడకుండా వున్నట్లయితే మీ గురి కుదిరేది!"- శేఖరం సానుభూతిగా అన్న మాటకు రాజాకు కోపం వచ్చింది.

"నేనేం చేశాను! నే రానంటే లాక్కుపోయి పైగా ఇదొకటా! చప్పుడైతే అదే కాబోలని కాల్చాను."

వర్ధనమ్మగారు అంతా వింటూ వూరుకుంది.

"అయినా ఎక్కడకు పోతుందిలే మళ్ళీ రాదా! చేతిలో చిక్కదా!" శేఖరం అన్నాడు.

కాసేపు ఎవరూ మాట్లాడలేదు.

శేఖరం సిగరెట్ ముట్టించి, "ఎవరూ వరండాలో పడుకుంది?" భార్య భుజం మీద అప్యాయంగా చెయ్యివేసి అడిగాడు!

"లక్ష్మణకుమారుడు!"

"అంటే!"

"రామ్మూర్తి!" -

వర్ధనమ్మ మాటలు రాజాకు నచ్చాయ్!

"హియర్! హియర్! భలే పేరు అక్కా!"

"అరవకురా తమ్ముడు. వింటాడేమో ఖర్మ!"

"ఓస్ ఫరవాలేదులే!"

శేఖరం వింటూ కూర్చున్నాడు! కానీ రామ్మూర్తి అన్నీ విన్నాడు! అతని మనసులో

ముల్లు గుచ్చుకున్నట్లయింది. లక్ష్మణకుమారుడని పేరు పెట్టిన తనకే, రాజా చెల్లెల్ని వ్వాలని ప్రయత్నం చేశారు.

రాజా, వర్ధనమ్మగారికి స్వయానా పినతల్లి కొడుకు! అతనికి ఆస్థి, హోదా వున్నాయి. కానీ కుంటి చెల్లెలు గూడ ఒకామె వుంది. రెండు చేతులు పీలగా వుంటాయి! ఏ పనీ ఇతరుల సహాయం లేనిదే, తన పని గూడ, చేసుకోలేని అమాయకురాలు. పేరు రోజా! ఆ రోజాను రామ్మూర్తి కివ్వాలని వర్ధనమ్మగారు ఆలోచించింది. ఆమె అంగ విహీనాన్ని డబ్బు చూపి, హోదా చూపి కప్పిపుచ్చాలని యత్నించింది. ఆమెను చేసుకోవటం వల్ల రాబోయే భవిష్యత్తు ఎంత ఉజ్జ్వలంగా వుంటుందో నోటి మాటలతో వర్ణించి చూపించింది. రామ్మూర్తిని మాటలతో, సత్కారాలతో గ్రుక్క తిప్పుకోకుండా చేసింది.

రామ్మూర్తి చంచల స్వభావుడై, స్వార్థపరుడైతే అంగీకరించేవాడే. కాని ముసలి తల్లి, తన వ్యక్తిత్వం అడ్డు వచ్చినయ్! జీవిత వసంతంలో డబ్బులో అడుగుబెట్టలేక పోయినాడు! రోజాను చేసుకోనని తిరస్కరించాడు!

వర్ధనమ్మగారికి ఆలోచన కంతరాయం కలిగింది. వ్రేటు తిన్న పులి లాగైంది! కానీ ఆమె తెలివిగలది. నేర్పు ఆమెకు సహజగుణం!

"బాగా ఆలోచించుకో మూర్తీ తొందరేముంది! నిన్ను బాగు చెయ్యాలనేగా నా కోరిక! అటు పిన్తల్లి కూతురు ఇటు మరిదివి! యిద్దరూ కావాల్సిన వాళ్ళే! అందుకే తాపత్రయం. నువ్వూ జీవితకాలమంతా హాయిగా గడపొచ్చు! ఏమంటావ్?"

కానీ రామ్మూర్తి పట్టినపట్టు విడువలా! కోరి ఆమెకు కోపమే తెప్పించాడు - కులమింటి మాలతిని చేసుకుని! ఆ కక్ష మనసులో పెట్టుకుని రామ్మూర్తి వివాహానికి రాలేదు. రామ్మూర్తి లేచి కాలకృత్యాలు తీర్చుకుని అన్నగారికోసం వెతికాడు!

వదినగారు చెప్పింది - "నీ సంగతి చెప్పాను మూర్తి. రాత్రంతా నిద్రలేదు గదూ యిప్పుడే పడుకున్నారు! అత్యవసరముంటే లేపుతా.... లేపమంటావా?"

"వద్దులే!" అని అన్నాడు ఆమె మాటల అంతరార్థం గ్రహించి రామ్మూర్తి.

పోబోతున్న రామ్మూర్తిని పిలిచింది వర్ధనమ్మగారు, "వచ్చిన పనేమిటో చెబితే, వీలయి నప్పుడు చెబుతాను... మరోలా అనుకోకు! ఎప్పుడూ వారనీ, వీరనీ పెద్దవాళ్ళు.... అంటే హోదాలో, ధనంలో.... వస్తుంటారా, నీతో తీరిగ్గా కూర్చుని మాట్లాడటానికి ఆయనకు తీరిక వుండకపోవచ్చు!" అన్నది.

రామ్మూర్తి తటపటాయింపు చూసి, "పొన్లే నే వినగూడని రహస్యమైతే ఆయనకే చెప్పుకో! మధ్య నా కెందుకు! ఎంతయినా అన్నదమ్ములాయిరి!" అంది.

రామ్మూర్తి బిడియపడసాగాడు! అతనికి స్త్రీలతో వాదనకు దిగటమంటే భయం.

"రహస్యమేముంది! ఏమీలేదు! నువ్వూ వినవచ్చు."

"ఇంతకూ సంగతి చెప్పనే లేదు!"

"ఏముంది! అర్జంటుగా పైకం కావాల్సి వచ్చింది! రెండువేలు! అంతే!"

"అంతే అనుకున్నాలే!.... అరే నిలబడే వున్నావేం కూర్చో!"

కూర్చున్నాడు రామ్మూర్తి - ఆమె కూర్చున్న సోఫా ప్రక్క కుర్చీలో!

"రెండు వేలు కావాలన్నమాట!"

"అవును వదినా! చాలా అవసరం! లేకపోతే వచ్చేవాణ్ణేగాను!"

"అవున్లే! నువ్వెప్పుడు వచ్చినా డబ్బు కోసమేగా. లేకపోతే రావు. మేమేదో డబ్బుల మీద శయనించి మిమ్మలను లోకువగా చూస్తామని మీరు అనుకొని, మిగతా వాళ్ళకూ అనుపిస్తున్నారు. వెధవ డబ్బు యివ్వాళ వుంటుంది, రేపు పోతుంది. దాని కోసం మీరు బంధాలు త్రెంపుకుంటారా! అత్తగారు మటుకు అత్తగారు, ఇక్కడేం లోపం జరుగుతుందని నీ దగ్గరుండటం! అక్కడ అన్నానికీ, గుడ్డకూ మొహం వాయటం బాగుంటుందన్న మాట! తాను తిని మాకు వండిపెట్టవచ్చుగా!..... ఏమిటో నేను మన వాళ్ళని తాపత్రయ పడటమేగాని మీకు ఆ విశ్వాసం లేదు!"

"ఆమెకు ఏం కష్టం కలిగిందో! లేకపోతే ఎందుకు వుండదు!"

"కష్టమా!" వర్ధనమ్మగారి కళ్ళల్లో ఆశ్చర్యం స్ఫురించింది. "అంటే నా కర్థంగాలా! ఆయన కన్నకొడుకేనాయే! ఇహ నేనేగా పరాయిదాన్ని! ఏదయినా జరిగితే నా వల్లనేగా!"

రామ్మూర్తి ఆమె చూపు నుంచి మొహం త్రిప్పుకున్నాడు!

"నీతో చెప్పే వుంటుంది ఆ సంగతేమిటో....?" అని రామ్మూర్తి సమాధానం కోసం ఆగింది. వచ్చే సూచన కనపడకపోగా, "అయినా అంత నేరమే నే చేసుంటే చెప్పి సరి పుచ్చవచ్చుగా! ఆమె పెద్దది, తెలిసింది. నాకు చెప్పటానికి ఎవరున్నారు?" అంది.

"ఏమిటక్కా చెప్పట మంటున్నావ్!..... ఓహో బావగారా! చెప్పకుండా వచ్చారిలా! ఏమిటి కథ!" - రాజా వచ్చి ప్రక్కన కూర్చున్నాడు!

"వూరికేనే!"

"డబ్బు కావాలిట్రా తమ్ముడూ! ఏమన్నా వుంటే సర్దరాదూ!"

"సరేలే! దానికోసమే నేనూ వచ్చింది! యిదో టెలిగ్రాం, శివం వ్రాశాడు, మూడు వేలు కావాలిట! రోజా.... సారీ యిట్రా అక్కా పనుంది."

రాజా, వర్ధనమ్మగారు ప్రక్క గదిలో కెళ్ళారు!

శివం అంటే రోజా భర్త! పేకాటలు, రేసులు, మొదలగు వాటిలో మాంచి అనుభవ శాలి!

"దాని కాపురం సంగతి ఆలోచించవేం!"

"ఏమిటాలోచించేది? ఎన్నిసార్లిలా! వందలు వేలు ఎక్కడి నుంచి వస్తాయి!"

"పెద్దగా అరవకు! రామ్మూర్తిక్కడే వున్నాడు! దానికీ వొంట్లో సరిలేదట! నానా యాతనా పడుతున్నదిట! ఎలా పైకం పంపకపోతే!" - రాజా మాటల్లో ఆదుర్దా కలసి వుంది.

కాసేపు మాటలు వినపడలా! 'డబ్బు ఇస్తున్నది గామాలు' అనుకున్నాడు రామ్మూర్తి!

"వెయ్యి చాలవక్కా!"

"అయితే యిటుతే! వెళ్ళు! యింతకన్న దొరకవ్!" - వర్ధనమ్మగారి కంఠం ఖంగున వినపడ్డది.

"ఇవ్వవన్నమాట! సరే కానివ్వు!"

రాజా చకచకా వెళ్ళిపోయినాడు! అతడు వెళ్ళిన కాసేపటికి, వర్ధనమ్మగారు వచ్చింది. గంభీరంగా వున్న ఆమె మొహంలోకి, నిదానించి, చూసి, -

"రోజా అంటాడేమిటి? ఎక్కడుందిప్పుడు?" అని రామ్మూర్తి అడిగాడు!

"మద్రాసులో!"

"శివంగారేం చేస్తున్నాడు?"

"ఏమీ లేదు!"

ఆమె ఏదో తన నుంచి దాస్తున్నదని రామ్మూర్తి గ్రహించుకోగలిగాడు! అందుకే ఆమె అలా వున్నదని గ్రహించుకుని, లేచి వెళ్ళాడు! ఆమె దాస్తున్న విషయమేమిటో రామ్మూర్తికి చూచాయగా తెలుసు!

శివం ఒకప్పుడు బాగా బ్రతికినవాడే! బాగా చదువుకుని పెద్ద ఉద్యోగం చేశాడు. వివాహం చేసుకున్నాడు లలితను! కొన్నాళ్ళు పూలబాట మీద జీవితం గడిచింది. లలిత క్షయవ్యాధికి గురై మరణించింది! దాంతో శివం జీవితం మీద విరక్తి చెంది ఉద్యోగం మానుకుని దేశాలు పట్టుకు తిరిగాడు. ఆ సమయంలో వర్ధనమ్మగారు, రాజా అతన్ని మంచిదారికి అంటే.... వాళ్ళ మాట వినే స్థాయికి తీసుకువచ్చి శుభలగ్నంలో రోజాను మెడకు గట్టారు. శివం రోజా వెనుక ధనం చూసి చేసుకున్నాడు. ఆ డబ్బుతో ప్రపంచంలోని సర్వ వ్యసనాలూ జీర్ణించుకుని త్రాడు తెగిన గాలిపటంలాగైనాడు. డబ్బులేనినాడు రోజాను నానా హింసలూ పెడతాడు! అదీ స్థితి!

ఇహపోతే రాజా! చదువు పూర్తిగా కొనసాగించలా! ఉన్న ఆస్తి, అయివేజు అంతా వర్ధనమ్మగారి చేతిలో వుంది, ఆమైనా రాజా బాగుకోరి అతణ్ణి, అతగాడి ప్రవర్తనను అదుపు చేస్తుంటుంది.

:: 4 ::

సాయంత్రం మూడు గంటలకు అర్జంటుగా మనిషి వచ్చి శేఖరానికి కబురందించాడు. క్రితం రాత్రి తుపాకీ దెబ్బ తిని పారిపోయిన చిరుతపులి, తిరిగి ఆ పరిసరాల్లోనే వుందనీ, నారపరెడ్డిగారు వెళ్తూ శేఖరానికి కబురంపారు.

ఆ సమయానికి రామ్మూర్తి, శేఖరంతో మాట్లాడుతున్నాడు!

"చూడు మూర్తీ! అవతల అర్జంటుగా పనుంది. రేపు మాట్లాడుకుందాం! వుండు. ఈ రోజు!"- చకచకా డ్రస్ వేసుకోవటం మొదలెట్టాడు శేఖరం.

"లేదు అన్నయ్యా, రేపు మధ్యాహ్నానికి కోర్టులో పైకం కట్టకపోతే ఇల్లు, పొలం వేలం వేస్తారు! చివరకు వీధులు పుచ్చుకు బయలు దేరాలి! ఎలాగోలా సర్దు!" -

రామ్మూర్తి కంఠంలో ఆదుర్దా, భయం శేఖరాన్ని చిరాకు పెట్టినయ్!

"ఉన్న పళాన డబ్బు కావాలంటే ఎలా! ఛస్తూ ఆ ముసిలాడు నాకీ ఉరి తగిలించాడు" అని విసుక్కున్నాడు! బోనులో చిక్కుకున్న కొత్త అడవి పులిలా ఫీలయ్యాడు!

"నా హక్కు ఆయుధంగా అడగటంలేదన్నయ్యా! ప్రాధేయపడుతున్నాను, నా ఇల్లు నిలబెట్టమని! అంతే అప్పుగా మాత్రం ఇవ్వు చాలు! మళ్ళీ వెసులుబాటు చిక్కగానే ఆలోచిస్తాను."

"సర్లే! మాటలకేమొచ్చె! నే వచ్చిందాకా వుండు. ఎక్కడోచోట చూస్తాను."

"వీల్లేదు అమ్మా, మాలతీ కంగారు పడుతుంటారు. నేనీ రాత్రికి ప్రయాణమై వెడ తాను!"

"సరే నీ యిష్టం! రేపు మధ్యాహ్నానికల్లా నే పైకం తీసుకువస్తాను!"

"అలాగే!"

తుపాకీ, బుల్లెట్స్ తీసుకుని టకటక వెళ్ళి జీప్ వేసుకు రోడ్డు ననుసరించాడు శేఖరం!

మేడ దిగి క్రిందికొచ్చేసరికి వర్ధనమ్మగారు కనుపించింది.

"రాత్రికి వూరెడుతున్నా వదినా" అని చెప్పాడు రామ్మూర్తి!

"మంచిది, అన్నగారేమన్నారు డబ్బును గురించి! ఇస్తారులే! తమ్ముడి వేమిటి అడిగితే ఇవ్వననట మేమిటి? అయినా మాకెందుకు మీకు రెండు వేలిమ్మని మామగారు ఉత్తర్వు జారీ చేసింతరువాత తప్పదుగా!"

"అప్పుగానే అడుగుతున్నాను వదినా! దానం తీసుకోవటం మా కులాచారం గాదు!" - రామ్మూర్తి మాటల్లో పౌరుషం ధ్వనించింది.

"అప్పా! తీర్చేదైతే అప్పు, తీర్చనిదైతే దానం! ఎలా తీరుస్తావయ్యా రెండు వేలు? అసలు ఏమి చూసి ఇస్తారు అప్పు నీకు?" - ఆమె మాటల్లో హేళన, ఎత్తిపొడుపు చురుక్కు మని తగిలింది మూర్తికి.

"నా మీద ఆ మాత్రం విశ్వాసం లేకపోతే ఇవ్వనే వద్దు! మనిషిని మనిషి నమ్మలేన ప్పుడు, ఈ పత్రాలు, తాకట్లు విలువ పెంచుకున్నయ్ వదినా! మనం డబ్బును సంపాదించ గలం గాని నీతిని, నిజాయితీని సంపాదించలేం. అది వుండటం వల్లనే యింకా బ్రతక గలుగుతున్నాం!"

"అయినా నీతో వాదన నాకెందుకులే! ఇచ్చేది ఆయన, పుచ్చుకునేది నువ్వు! - వెళ్తే తెల్లవారుజాము బండికేగా! అలారం పెట్టి వుంచుతాను!"

అంతటితో ఆ చర్చ ముగిసింది, శుష్క ప్రియాలు శూన్య హస్తాలు, అందుకొని రామ్మూర్తి గృహోన్ముఖుడయ్యాడు! రాత్రి మూడు గంటలకు చేసంచి తీసుకుని, స్టేషనుకు వెళ్ళాడు! నిద్రపోతున్నదని వర్ధనమ్మగారికి చెప్పకుండానే బయలుదేరి వెళ్ళాడు! వెళ్ళేప్పుడు మాత్రం రాజాలుకు చెప్పి తలుపేసుకోమని వెళ్ళాడు!

నిద్రలేకపోయిన పని కాలేదన్న నైరాశ్యంతో వచ్చిన రామ్మూర్తినిచూసి మాలతి గ్రహించుకోగలిగింది విషయం. కానీ తల్లి మాత్రం ఊహించుకో లేకపోయింది.

"ఇచ్చాడా! నాయనా!" అని అడిగింది.

"నీకు తెలియదమ్మా మనుషుల నైజాలు! మాటల్లో వున్నంత ఆప్యాయత ప్రవర్తనలో వుండదు. వంట మనిషిగా నువ్వు అక్కడ వుండలేదని వదినకు కోపం! నిజానికి లోకులకేం తెలుసు నీ స్థానమేమిటో అక్కడ! ధనం దివ్యౌషధం అన్ని వంచనలకు! తెలుసుకో యిప్పటికైనా!"

"కన్న కొడుకు గురించి, నా కెందుకు తెలియదు నాయనా! తెలుసు! కానీ ఏమీ చేయలేని అసమర్ధురాలను! వాడు అంతే!"

"చెయ్యాల్సిన సంగతేమిటో ఆలోచించండి!"- మాలతి మాటలకు రామ్మూర్తికేం పాలుపోలా!

"ఏముంది! చూస్తూ వూరుకోవటమే! అనవసరంగ అక్కడకు పోయి వృధాగా వచ్చాను. ఈ రెండు రోజుల్లో వేరే ఎక్కడైనా ప్రయత్నించనన్నా ప్రయత్నించేవాడిని!"

"అసలేమన్నారు?"

"ఏముంది అనటానికి! అన్నయ్య తెస్తానన్నాడు! నమ్ముక్కూర్చుంటే అయినట్లే!

"అదీ చూద్దాం!" - లక్ష్మమ్మగారికి కింకా శేఖరం మాటల మీద నమ్మకమే!

"చూడాల్సిందే దిక్కులు!"

అన్న మాట ప్రకారం శేఖరం రానే వచ్చాడు! డబ్బు తీసుకుని గాదు! పోలీసుల్ని తీసుకుని! వాడిన ముఖంతో వచ్చాడు లోపలకు!

"ఏదీ డబ్బు?" అని తీక్షణంగా చూశాడు!

రామ్మూర్తి, మాలతీ, చివరకు లక్ష్మమ్మగారూ శేఖరం వాలకానికి, మాటలకూ విస్తుపొయ్యారు!

"ఏం డబ్బు?"

"అదే వస్తూ వస్తూ ఎత్తుకు వచ్చిన మూడు వేల రూపాయలు, బంగారం"

రామ్మూర్తి నెత్తిన పిడుగుపడ్డట్లయింది.

"నేను దొంగిలించుకు వచ్చానా అన్నయ్యా! నువ్వేనా ఆ మాటలంటున్నది?"

"అవును! చూడు నీ అన్నయ్యను కాబట్టే నా యింట్లోకి రానిచ్చాను! డబ్బు యిస్తానని మాట యిచ్చాను! యిలాంటి నీచుడివి, దొంగవీ అని తెలిస్తే.... ఎందుకులే! మర్యాదగా ఇచ్చెయ్! అనవసరంగా పోలీసులు, జైళ్ళు, కోర్టుల చుట్టూ తిరగటం దేనికి?"

ఆ గదిలో గాలి కూడా రా సాహసించలా! లక్ష్మమ్మగారి కంతా అయోమయంగా వుంది, ఏది నమ్మటమో, ఏది అబద్ధమని కొట్టి పారివేయటమో ఆమెకు అవగతం కాలా!

"కూర్చో శేఖరం! నిదానంగా మాట్లాడుకోవచ్చు!..... ఆ పోలీసులెందుకీ భాగ్యానికి! తెలియక వాడేదైన పొరపాటు చేస్తే....."

"అమ్మా నేనే పాపమూ ఎరగను"- అంతకన్నా రామ్మూర్తి మరేమీ చెప్పలేకపోయినాడు! అవమానము, బాధ అతని కంఠాన్ని రుద్ధపరిచినయ్!

"అసలేం జరిగిందో చెప్పు శేఖరం! పైకం కావాలనేగా నీ దగ్గరకొచ్చింది వాడు. ఈ రోజు ఆ డబ్బు కట్టకపోతే పొలం, యిల్లు వేలం పాడతారు! నీకు తెలుసు అనుకుంటాను."

"తెలుసు! వాడు పైకం ఈ ఉదయమే చెల్లించేశాడు పూర్తిగా! అదీ తెలుసుకునే వస్తున్నా!"

"చెల్లించాడా?!!" - రామ్మూర్తికి మతిభ్రమణం కలిగినట్లయింది. తనకు తెలియకుండా పైకం ఎవరు చెల్లించారు? ఏమిటీ పరిణామం? అర్థంగాలా!

"నిజమా రామ్మూర్తీ! చెప్పుబాబూ!" - లక్ష్మమ్మగారికీ రామ్మూర్తి చర్య మీద అనుమానం పొడసూపింది.

"లేదమ్మా లేదు! నేనేమీ ఎరుగను నీ మీద ఒట్టు!" - విలవిల్లాడాడతడు.

తిరిగి నిశ్శబ్దం పొగయింది. అక్కడ చుట్టుపట్ల జనము చేరసాగారు ఈ వింత చూడ టానికి. అవును మరి తమ్ముడు దొంగ! అన్న ఫిర్యాదీ!

శేఖరానికీ తనే తొందరపడుతున్నానేమొ అన్న అనుమానము వచ్చింది, కానీ ఇనప్పెట్టె లో పెట్టిన రూపాయలు, వర్ధనమ్మ నగా మాయం కావటం ఎలా సంభవించింది? అర్ధ రాత్రి నిద్ర లేచి, స్టేషనుకు వెళ్ళింది రామ్మూర్తి! తదితర నౌకర్లను నయానా, భయానా బెదిరించి చూశారు. లాభం లేకపోయింది. డబ్బుతో ముఖ్య అవసరం ఎవరికి?

"మీ రామ్మూర్తికి!" శేఖరం భార్య మాటలు అబద్ధాలని కొట్టి పారెయ్యబొయ్యాడు.

"నిజం బాబయ్యా! ఆయన వాలకం, బిత్తర చూపులూ అదోలాగున్నాయి. అదీగాక మన జాకీని రాత్రిపూట కట్టెయ్యమని ఒకటే పోరు పెట్టాడు! ఆయనదప్ప మరెవరొ చ్చారండీ?" అని రాజాలు విన్నవించుకొన్నాడు.

"రాజా రానేలేదా?"

శేఖరం ప్రశ్నకు వర్ధనమ్మకు కోపమొచ్చింది.

"వాడికలాంటి కొంచెపు బుద్ధులేం లేవు! నిన్న డబ్బు యివ్వలేదని కోపంగా వెళ్ళాడు మళ్ళీ రానేలేదు".

నమ్మక తప్పలా శేఖరానికి. పైగా పైకం చెల్లించినట్లు తాలూకా ఆఫీసులో తెలిసింది. రామ్మూర్తే నేరస్తుడు.

"అయితే నే చేయగలిగిందేమీ లేదు. మిస్టర్ ఇన్‌స్పెక్టర్! మీ పని పూర్తి చేసుకోవచ్చు!" శేఖరం ఆ మాటలు మాత్రం అని బరబరా వెళ్ళి వాకిట్లో జీపులోకెళ్ళి కూర్చున్నాడు.

"మూర్తిగారూ, శేఖరంగారింట్లో పైకం పోయిందని మాకు రిపోర్టు వచ్చింది. అనుమానితులు మీరు. ఇల్లు సోదా చెయ్యాలి."

"అలాగే ...... కానివ్వండి" - రామ్మూర్తి ప్రక్కకు తప్పుకున్నాడు. మాలతి నిరుత్తరురాలయింది.

"మీరు స్టేషనుకు రావాలి మీ దగ్గర వాఙ్మూలం తీసుకోవాలి!"

ఇన్‌స్పెక్టర్ మాటలకు రామ్మూర్తి "అలాగే" అన్నాడు.

రామ్మూర్తిని తీసుకుని ఇన్‌స్పెక్టర్ జీప్ ఎక్కాడు. అవమానంతో, బాధతో రామ్మూర్తి తల వ్రాలిపోయింది. జన్మలో వూహించని, చెయ్యని నేరం, అవమానం మొయ్యవలసినందుకు అతనికి దైన్యమనిపించింది. వీధిలో జనమంతా వింతగా చూడసాగారు. కారు స్టార్ట్ కాబోయ్యేసరికి వరదరాజులుగారు హడావిడిగా వచ్చారు.

"నమస్కారం ఇన్‌స్పెక్టరుగారూ! రామ్మూర్తిగారిపై దొంగతనం మోపారటగదా! ఆయన ఏ పాపమూ ఎరగడు, రాత్రే రామ్మూర్తిగారు వాళ్ళన్నయ్యగారి వూరి నుంచి రాలేదని తెలిసింది. ఎట్లాపోయి ఎట్లా వస్తుందోనని నేను ఆ డబ్బు చెల్లించా! అంతేబాబూ!"

శేఖరం, రామ్మూర్తి ఆశ్చర్యపోయారు!

"మీరా!" రామ్మూర్తి ఆశ్చర్యం, ఆనందంలో తేలిపోయినాడు.

'మరి తన ఇంట్లో సొమ్ము దొంగిలించిందెవరు!' అన్న ప్రశ్న శేఖరానికి ఉదయించింది.

"మీరూ రావాలి, స్టేషనుకెళదాం" - ఇన్‌స్పెక్టరు వరదరాజుల్ని కోరాడు. రెండు జీపులు స్టేషనుకు దారి తీశాయ్.

"మీ దయకు కృతజ్ఞుడ్ని వరదరాజుగారూ" - కృతజ్ఞత తెల్పుకున్నాడు రామ్మూర్తి.

:: 5 ::

రామ్మూర్తి కవరు చించి ఉత్తరం తీశాడు. శేఖరం వ్రాశాడు. చాలా పెద్ద ఉత్తరం!

"ఎవరు వ్రాశారు నాయనా?" తల్లి అడిగింది.

"శేఖరం!"

"ఏమని?"

"- తమ్ముడూ.

క్షమించు. ఆవేశంలో నిన్ను నేరస్తుణ్ణి చేసి అనరాని మాటలన్నాను. కానీ నిజం నిల కడ మీద తెలుసుకున్నాను. ఇప్పుడు నా హృదయంలో ఎంత తీవ్రంగా బాధపడుతున్నానో వ్రాయలేను. ఏ పాపమూ ఎరుగని నిన్ను నలుగురిలో నగుబాట్లు చేశాను. మన వంశా నికీ, తరతరాల మన కుటుంబానికీ మాయని మచ్చ తెచ్చాను. కళంకితుణ్ణి. ఆపదలో సాయం కోరి వచ్చిన నిన్ను, నిజా నిజాలు గుర్తించలేని మౌఢ్యంలో నేరస్తుడిగా సంఘం ముందు నిలబెట్టాను. నా అపరాధానికి శిక్షగా ఏం చేసినా నా పాపం చెల్లదు. క్షంతవ్యుణ్ణి.

అనవరతం నా పాపానికి నేనే బలి అవుతూ, నిన్ను కోరుకునేది ఒక్కటే. మన సోదర బంధం మాత్రం విచ్చిన్నం చేయకు. మనం పెరిగింది విభిన్న ప్రకృతులలో, పరిస్థితులలో అయినా మనం ఒకమ్మ బిడ్డలమే! నీ అంత మంచి తమ్ముడిని పొందగిలిగినందులకు ధన్యుణ్ణి.

ఇంతకూ ఆ రోజు దొంగతనం చేసింది ఎవరో గాదు.... రాజా! అంటే తెలుసు గదా వర్ధని పింతల్లి కొడుకు! పయోముఖ విషకుంభం! వాళ్ళక్క డబ్బు ఇవ్వలేదని ఆ అర్ధరాత్రి నువ్వు స్టేషనుకు వెళ్ళింతరువాత ఈ చౌర్యం చేశాడు. ఇప్పుడే అరెస్టయినట్లు తెలిసింది. నెల్లూరులో దొంగ సొమ్ములు మారుస్తుండగా పట్టుకున్నారు. వీలయితే ఒక్కసారి వర్ధని మొహం చూడు! ఎలా వుందో వెల్లవేసిన గోడ లాగ.

అమ్మకు, మరదలకూ, నా వేడికోలు.

ఇట్లు
శేఖరం

"సొమ్మొకచోట! నిందొకచోట! అన్నారు! పాపం వాడెంత విచారపడుతున్నాడో!"

లక్ష్మమ్మగారి మాటలకు రామ్మూర్తి చిరునవ్వు నవ్వాడు.

"యింత జరిగిం తరువాత విచారమెందుకూ, పరువూ, ప్రతిష్ట, అన్నీ వీధిలోకెళ్ళిం తరువాత ఏమైతేనేం! ఆ వరదరాజుల గారి కున్నంత నిజాయితీ, నమ్మకం లేకపోయె బావగారికి! రాజా పట్టుబడకపోతే మనం దొంగలమేగా! దొరకబట్టి దొంగ లేకపోతే దొర! ఏమీ న్యాయం" - మాలతి ఈసడించుకుంది.

"జరిగిందేదో జరిగింది. వూరుకోండి. నేనలా వెళ్ళి ఈ ముక్క వరదరాజులుగారితో చెప్పొస్తా, ఆయనా సంతోషపడతాడు!"

రామ్మూర్తి కండువా వేసుకొని వరదరాజుల యింటివేపు సాగిపోయినాడు.

'ఎంతయినా శేఖరం అమాయకుడు పిచ్చినాయన' అని అనుకుంది లక్ష్మమ్మగారు మాత్రం కన్న హృదయం గనుక. ●